

మనం
కడప | అన్నమయ్య

బాధితులను కాపాడటంలో మానవత్వం చూపండి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్

మనం ప్రతినిధి, కడప నవంబర్ 11:రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సకాలంలో అందించే చిన్న సహాయం కూడా ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధితులను కాపాడే 'గుడ్ సమారిటన్'లకు పూర్తి చట్టపరమైన రక్షణ ఉందని, పోలీస్ విచారణలు, ఆసుపత్రి లాంఛనాలకు భయపడకుండా ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని ఆయన సూచించారు. బాధితులను ఆసుపత్రికి చేర్చే సహాయకులను ఎలాంటి కారణంతోనూ ఇబ్బందులకు గురిచేయకూడదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. వారి వ్యక్తిగత వివరాలు, చిరునామా చెప్పాలని బలవంతం చేయరాదని, బాధితుడిని చేర్పించిన వెంటనే వారు అక్కడి నుంచి వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు.






వెన్నుపోటుతో ఓడిన ఆ ఎంపీటీసీ..!

సొంత సామాజిక వర్గం నుంచి ఒక దెబ్బ.. రాజకీయ వర్గపోరుతో మరో దెబ్బ..!

పెనగలూరు మండల కేంద్రంలోని ఓ ఎంపీటీసీ ఓటమిపై ఆసక్తికరమైన రాజకీయ చర్చ



పెనగలూరు(అక్టోబర్ 11),మనంన్యూస్:

ఎన్నికల బరిలో ప్రత్యర్థులతో పోరాడటం ఒక ఎత్తయితే.. సొంతవారి మధ్యే సాగుతున్న రాజకీయ పోరును ఎదుర్కోవడం మరో ఎత్తు..! బయటకు మద్దతు ప్రకటిస్తూ.. లోలోపల మరో రాజకీయ లెక్కలు వేసే నాయకులు ఉంటే ఫలితం ఎలా ఉంటుందో పెనగలూరు మండల కేంద్రం లోని ఓ ఎంపీటీసీ ఎన్నికల ఫలితం మరోసారి చర్చకు తెరలేపింది. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి పక్కనే తిరిగిన కొందరు నాయకులు నిజంగా ఓట్లు వేయించారా..? లేక ప్రచారం పేరుతో తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను చూసుకున్నారా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ ఓటమి వెనుక ప్రత్యర్థి పార్టీల వ్యూహాల కంటే సొంత సామాజిక వర్గంలోని అంతర్గత విభేదాలు, ఇతర పార్టీలతో ఉన్న ఆర్థిక లావాదేవీలు, రాజకీయ వర్గపోరు ప్రభావం ఎంత ఉందన్న దానిపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

సొంత సామాజిక వర్గం నుంచే వెన్నుపోటా..?

సాధారణంగా ఎన్నికల్లో ఒక సామాజిక వర్గం అభ్యర్థికి అదే వర్గానికి చెందిన నాయకులు, ఓటర్లు అండగా నిలుస్తారని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. కానీ ఈ ఎన్నికలో ఆ అంచనాలు ఎంత వరకు నిజమయ్యాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థికి బహిరంగంగా మద్దతు తెలిపిన కొందరు సొంత సామాజిక వర్గ నాయకులే తెరవెనుక వేరే రాజకీయ పార్టీల సమీకరణాలకు ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో కనిపించిన మద్దతు ఓట్ల రూపంలో ఎందుకు ప్రతిఫలించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు, సంబంధిత నాయకుల వివరణలు వెలుగులోకి రావాల్సి ఉంది.

రాజకీయ వర్గపోరు.. ఓటమికి మరో కారణమా..?

ఒకే పార్టీలో ఉన్నప్పటికీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు, వ్యక్తిగత విభేదాలు ఎన్నికల సమయంలో బయటపడటం కొత్తేమీ కాదు.

తమకు రాజకీయంగా ప్రాధాన్యత దక్కలేదనే అసంతృప్తి కొందరిలో ఉంటే.. అభ్యర్థి ఎదుగుదల తమ రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందిగా మారుతుందనే ఆలోచనలు మరికొందరిలో ఉండవచ్చన్న చర్చ సాగుతోంది. బయటకు ఒకే వేదికపై కనిపించినా.. తెరవెనుక మాత్రం వేర్వేరు రాజకీయ లెక్కలు నడిచాయా? అభ్యర్థి గెలుపు కంటే తమ వర్గం రాజకీయ ప్రయోజనాలకే కొందరు ప్రాధాన్యత ఇచ్చారా? అన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

కట్టప్పల పాత్రపై చర్చ..!


ఎన్నికల సమయంలో అభ్యర్థి పక్కనే ఉంటూ ప్రచారంలో పాల్గొన్న నాయకుల్లో కొందరి పాత్రపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ప్రచారంలో ముందుండి.. ఓట్ల సమీకరణలో వెనుకబడ్డారా? లేక తెరవెనుక ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అయితే ఇవన్నీ స్థానికంగా వినిపిస్తున్న రాజకీయ ఆరోపణలు, విశ్లేషణలు మాత్రమే. వాస్తవ పరిస్థితి తెలుసుకోవాలంటే గ్రామాల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు, పోలింగ్ సరళి, ప్రచారంలో పాల్గొన్న నాయకుల పాత్రను పరిశీలించాల్సి ఉంటుంది.

ఓటమి ఒకరి ఖాతాలోనా.. తెరవెనుక రాజకీయాల ఫలితమా..?

ఎన్నికల్లో ఓటమికి ఒక్క కారణమే ఉండకపోవచ్చు. అభ్యర్థి ప్రచారం, ఓటర్ల అభిప్రాయం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, పార్టీ నాయకుల మధ్య సమన్వయం.. ఇలా అనేక అంశాలు ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే పెనగలూరు మండలంలో ఈ ఎంపీటీసీ ఓటమి మాత్రం మరోసారి ఒక రాజకీయ ప్రశ్నను ముందుకు తెచ్చింది. ప్రత్యర్థులతో పోరాడి ఓడిపోయారా..? లేక సొంతవారి మధ్య సాగిన రాజకీయ చదరంగంలోనే వెనుకబడ్డారా..? ఎన్నికల ఫలితం ప్రకటించడంతో పోరు ముగిసినా.. ఆ ఓటమి వెనుక అసలు రాజకీయ లెక్కలపై చర్చ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది..!

బండారు దంపతుల గృహప్రవేశ వేడుకలకు ముఖ్యఅతిథిగా ముక్కా వరలక్ష్మి





ఓబులవారిపల్లి, నవంబర్ 11,మనం న్యూస్

రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం చెన్నరాజుపాడు పంచాయతీ పరిధిలోని సోమమాకుల వారిపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన బండారు వెంకటరమణ, ప్రభావతి దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహంలో ప్రవేశ వేడుకను శుభముహూర్తాన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. గృహయజమానులు బండారు వెంకటరమణ మరియు ప్రభావతి దంపతులు సాదరంగా ఆహ్వానించడంతో ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముక్కా వరలక్ష్మి నూతన గృహంలోకి అడుగుపెట్టిన వెంకటరమణ – ప్రభావతి దంపతులకు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన గృహం వారికి అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు, పరిపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మితో పాటు పలువురు ఎన్డీయే కూటమి నాయకులు, స్థానిక పెద్దలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన గృహప్రవేశం సందర్భంగా ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గృహయజమానులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు.



పంచాయతీ ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వద్దు

కలెక్టర్ నిశాంత్ కుమార్

మనం ప్రతినిధి, మదనపల్లె నవంబర్ 11

త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్.జె.ఆర్ ఫంక్షన్ హాల్‌లో పంచాయతీ ఎన్నికల స్టేజ్–1 అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర దశల్లో ఎలాంటి చిన్న తప్పిదాలు లేదా వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల హ్యాండ్‌బుక్‌ను సమగ్రంగా చదివి విధులను అవపోసన పట్టాలని, ఏవైనా సందేహాలుంటే శిక్షణ సమయంలోనే ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వివాదాస్పద ప్రాంతాల్లో అవసరమైన చోట తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు ఎక్కడా ఆస్కారం ఇవ్వకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పర్వాన్ని పూర్తి చేసేలా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అనంతరం అధికారులకు పలు సాంకేతిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, జీఎన్‌డబ్ల్యూఎస్ అధికారి అమర్నాథరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, స్టేజ్–1 ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ఉప మేయర్ ఎన్నికకు 23న సమావేశం

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

నవంబర్ 18న ఫారం–II ద్వారా ప్రత్యేక సమావేశానికి నోటీసుల జారీ

కడప, నవంబర్ 11 మనం న్యూస్ : రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నిక నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 4, 2026న జారీ చేసిన నోటిఫికేషన్ నం.1474/ ఎస్ ఇ సి– ఎఫ్ 1/2026–1 ప్రకారం కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు నవంబర్ 18వ తేదీన జిల్లా కలెక్టర్ లేదా అధీకృత సంయుక్త కలెక్టర్ ద్వారా ఫారం––××లో ప్రత్యేక సమావేశానికి సంబంధించిన నోటీసులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నోటీసులను నగర మేయర్, ఎన్నికైన సభ్యులు, పదవీరీత్యా సభ్యులందరికీ అందజేయాలని సూచించారు. నవంబర్ 23వ తేదీన ఉదయం 11 గంటలకు



కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు ఎన్నిక నిర్వహించలేని పక్షంలో నవంబర్ 24వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని, ఆ రోజు సెలవు దినమైనప్పటికీ ఎన్నిక నిర్వహణకు చర్యలు తీసుకోవాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 24వ తేదీన కూడా ఉప మేయర్ ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడితే, తదుపరి తేదీ నిర్ణయం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం, 1955, 1994తో పాటు ఉప మేయర్ ఎన్నికల నిర్వహణ నిబంధనలు–2026 ప్రకారం ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల జారీ, ప్రత్యేక సమావేశ నిర్వహణ తదితర చర్యలను విధిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




అంగన్వాడి సెంటర్లో తక్కువ బరువు ఉన్న పిల్లలను నెలలో రెండుసార్లు బరువు తీయాలి

రెండవ రోజుపోషణ బీ పడాయిబీ

పుల్లంపేట నవంబర్ 11 (మనం న్యూస్)తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని పుల్లంపేట ఏపీ మోడల్ స్కూల్ నందు పోషణ బీ పడాయి బీ ట్రైనింగ్ రౌండ్ ...2 సిడిపిఓ ఎస్ రేణుక గారి ఆధ్వర్యంలో జరిపారు. ఈరోజు పిల్లల గ్రోత్ గురించి వై నిర్మలాదేవి, ఎం జయ లక్ష్మమ్మ, పి పార్వతి దేవి, వారు మాట్లాడుతూ పిల్లల పెరుగుదల పర్యవేక్షణ అంగన్వాడి సెంటర్లో ప్రతినెల గర్భవతులకు, బాలింతలకు, 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలు గ్రోత్ వేయాలి. వయసుకు తగ్గ బరువు ఎత్తుకు ఉండాలి బిడ్డ ఆరోగ్యం గా ఉంటే వయసుకు తగ్గ ఎత్తు బరువు ఉంటాడు. తక్కువ బరువు ఉన్న పిల్లవాడిని ఎలా గుర్తించాలి. తక్కువ బరువు ఉన్న పిల్లవాడు నెలలో రెండుసార్లు బరువు తీయాలి. బిడ్డ తల్లికి బిడ్డ గురించి తెలియజేయాలి. తక్కువ బరువుతో ఉన్న బిడ్డకు తగు మోతాదులో సమతలఆహారము పెట్టాలి. అంగన్వాడి కార్యకర్త బిడ్డ గురించి తల్లికి వివరించాలి ట్రైనింగ్లో వివరించారు. టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్+. పద్మశ్రీ మాట్లాడుతూ పోషకాహార లోపం, బాలామృతంప్లస్ గురించి ట్రైనింగ్లో చెప్పారు. ఇంకా పలు అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు క్షుణ్ణంగా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి కార్యకర్తలందరూహాజరయ్యారు.

కార్తీక సోమవారాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



సిద్దవటం, నవంబర్ 11 మనంన్యూస్: కార్తీక సోమవారాల్లో లంకమల అభయారణ్యంలోని నిత్యపూజకోనలో వెలసిన నిత్యపూజయ్య స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓ సురేష్ కుమార్ రెడ్డి, చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం సిద్దవటం ఎస్సై హరికను కలిసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని వారికి తెలిపారు.

గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తాం

గ్రామ సర్పంచ్ ఎన్నికల బరిలో ముగ్గురు ఎంపిక


జేఏసీ మండల అధ్యక్షులు బండారు రాజగోపాలయ్య



సిద్ధవటం నవంబర్ 11(మనం న్యూస్) : మండల కేంద్రమైన సిద్దోటంలో బుధవారం మండల జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించామని జేఏసీ మండల అధ్యక్షులు బండారు రాజగోపాలయ్య తెలిపారు రాబోయే సిద్ధవటం గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు, గోనెపల్లి సిద్దయ్య, బసెట్టి సుబ్రహ్మణ్యం, వేల్పుల రామచంద్రయ్య అనే ముగ్గురుని ఎంపిక చేసామని మండల జేఏసీ అధ్యక్షులు బండారు రాజగోపాలయ్య తెలిపారు గ్రామాభివృద్ధికి సహకరించాలని సిద్ధవటం గ్రామ ప్రజలకు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల జేఏసీ సభ్యులు పాల్గొన్నారు

నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సిద్ధవటం, నవంబర్ 11 మనంన్యూస్ : సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి కుమార్తె స్వాతి నిశ్చితార్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాస్ రాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ అవ్వారు రవిశంకర్, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబీ), మాజీ వార్డు మెంబర్ సామల చెంగయ్య, చిన్న వెంకటయ్య, గౌస్, గంగయ్య, విజయ్, జగన్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నక్కలపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

తొమ్మిది హామీలతో ప్రజల ముందుకు సర్పంచ్ అభ్యర్థి కట్టా గిరిబాబు



చిట్వేలీ నవంబర్ 11 మనం న్యూస్: గ్రామ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించడమే లక్ష్యంగా నక్కలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తొలిసారిగా ఎన్నికల బరిలో నిలుస్తున్న కట్టా గిరిబాబు ప్రజల ముందుకు వచ్చారు. గ్రామ ప్రజలు తనను ఇంటి బిడ్డగా ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నక్కలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు తొమ్మిది ముఖ్యమైన అభివృద్ధి హామీలను ప్రకటించారు.

కట్టా గిరిబాబు ప్రకటించిన తొమ్మిది అభివృద్ధి హామీలు

1.పార్కులు, ఆటస్థలాల ఏర్పాటు: గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేసి, చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేక ఆటస్థలాలు కల్పించడం.

2.ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు: గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక చికిత్స, అవసరమైన మందులు అందుబాటులోకి తీసుకురావడం.

3.రైతులకు అండగా నిలవడం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయడంతో పాటు పంటల మార్కెటింగ్కు సహకరించడం.

4.ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు ప్రాధాన్యత: అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలకు సహకారం అందించడం.

5.వాకింగ్ ట్రాక్ నిర్మాణం: గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉదయం, సాయంత్రం నడక సాగించేందుకు ప్రత్యేక వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం.

6.పరిశుభ్రతకు పెద్దపీట: నిరంతర చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ చేపట్టి చెత్త నుంచి సంపద సృష్టించే విధానాన్ని ప్రోత్సహిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడం.

7.స్మశాన వాటికల ఏర్పాటు: గ్రామ పరిధిలోని అన్ని ప్రాంతాలకు అవసరమైన స్మశాన వాటికలను ఏర్పాటు చేసి అంత్యక్రియలకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం.

8.యువతకు ఉపాధి, క్రీడల్లో ప్రోత్సాహం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, నైపుణ్య శిక్షణకు సహకరించడంతో పాటు క్రీడలను ప్రోత్సహించడం.

9.మౌలిక వసతుల అభివృద్ధి: గ్రామంలోని రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు ప్రతి వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయడం.

ఈ తొమ్మిది అభివృద్ధి హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని కట్టా గిరిబాబు తెలిపారు. సర్పంచ్ పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తానని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు.నక్కలపల్లి గ్రామ ప్రజల ఆదరాభిమానాలు, ఆశీర్వాదాలతో తనకు సర్పంచ్గా సేవ చేసే అవకాశం కల్పించాలని కట్టా గిరిబాబు విజ్ఞప్తి చేశారు.


నూతన జెడ్పీ కార్యాలయ పనులను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్ కుమార్



మనం ప్రతినిధి, మదనపల్లె:మదనపల్లె పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) నూతన కార్యాలయ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక బి.టి. కళాశాల వెనుక వైపు ఉన్న పాత రవీంద్రనాథ్ ఠాగూర్ భవనాన్ని జిల్లా పరిషత్ కార్యాలయంగా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో, అక్కడ జరుగుతున్న మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన నూతన జెడ్పీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం జరగనున్నందున, ఆ లోపే భవన నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూనే, నిర్ణీత గడువుకు అనుగుణంగా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ప్రత్యేక చాంబర్, విశాలమైన సమావేశ మందిరం, సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన గదులతో పాటు విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులన్నీ సమగ్రంగా సమకూర్చాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు వినతులు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు కూడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. నూతన భవనంలోకి కార్యాలయం మారిన తర్వాత జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాలను సైతం ఇక్కడే నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. పాలనా వ్యవహారాలు సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీపతితో పాటు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంజుమాన్ ఎం అహలె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు

విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం - విద్యలో ప్రతిభ కనపరిచిన 34 మందికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు



ప్రొద్దుటూరు నవంబర్ 11 మనం న్యూస్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే ప్రధాన లక్ష్యంగా అంజుమాన్ ఎం అహలె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ వి ఎస్ ముక్తియార్ మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక ఇంటర్నేషనల్ కళ్యాణ మండపంలో అంజుమన్ ఏ అసలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం విద్యార్థుల ప్రతిభకు పురస్కారాలు కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా2025-26 విద్యా సంవత్సరంలో ప్రొద్దుటూరు పట్టణంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన సుమారు 34 మంది ముస్లిం విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం వి ఎస్ ముక్తియర్ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ప్రతిభను ప్రోత్సహించి, ఉన్నత లక్ష్యాల సాధనకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని అంజుమాన్ ఏ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం ముస్లిం విద్యార్థుల్లో విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి వారి ప్రతిభను వెలికి తీయడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కృషి పట్టుదల ఉన్నత స్థానానికి చేరుకోవాలని లక్ష్యం ప్రతి విద్యార్థికి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రతిపాదిత మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా మంచి నడవడిక, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజానికి, దేశానికి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. న్యాయవాది విశ్వనాథ దాదాసాహెబ్, ఇనాయతుల్లా, అంజుమాన్ ఏ అహలే ఇస్లాం కమిటీ కార్యదర్శి ఇలియాస్ ఖురేషి, మాజీ అధ్యక్షుడు ఇక్బాల్ తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రూహుల్లా, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపల్ ఖాజామైనుద్దీన్, ఎస్ఆర్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ అలీ అక్బర్ తదితరులు విద్యార్థులకు విద్యా, వృత్తి మార్గదర్శకత్వం అందిస్తూ ప్రేరణాత్మక సందేశాలు ఇచ్చారు.

భవిష్యత్తులో ఉన్నత విద్యకు అందుబాటులో ఉన్న అవకాశాలు, వివిధ రంగాల్లో సాధించగల విజయాలపై అవగాహన కల్పించారు. అంజుమాన్ ఏ అహలే ఇస్లాం కమిటీ సభ్యులు నజీర్, జిలానీ, న్యాయవాది జిలానీ బాషా కౌన్సిలర్ షేర్ అలీ తదితరులు పాల్గొన్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను అతిథులు అభినందించారు.

పిఠాపురం తైక్వాండో పోటీల్లో మెరిసిన కోడూరు కిరణాలు

జాతీయ స్థాయి పోటీలకు సారా, లాస్య ఎంపిక



రైల్వే కోడూరు, నవంబర్ 11, మనం న్యూస్

పిఠాపురంలో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన బాలికలు తమ అద్భుత ప్రతిభతో సత్తా చాటారు. నవంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించిన ఈ తైక్వాండో పోటీల్లో ఎస్ కె అకాడమీకి చెందిన క్రీడాకారిణులు అసాధారణ ప్రదర్శన కనబరిచి పతకాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా పతకాలు సాధించిన ఈ ఇద్దరు ప్రతిభావంతులైన బాలికలు కూడా రైల్వే కోడూరు వాసులు కావడం స్థానికంగా గర్వకారణంగా మారింది. ఈ పోటీల్లో ఎస్ కె అకాడమీకి చెందిన షేక్ సారా అండర్-19 విభాగంలోని 40 కేజీల కేటగిరీలో బరిలోకి దిగి, ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ అత్యుత్తమ ప్రతిభతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. అదేవిధంగా మరో ప్రతిభావంతురాలైన వై. లాస్య అండర్-19 విభాగంలోని 46 కేజీల కేటగిరీలో హోరాహోరీగా సాగిన పోరులో ఎంతో పట్టుదల కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

పిఠాపురం వేదికగా జరిగిన ఈ పోటీల్లో అద్భుత విజయాలు సాధించడమే కాకుండా, ఈ ఇద్దరు కోడూరు క్రీడాకారిణులు నవంబర్ 26 నుండి 30 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అధికారికంగా ఎంపికయ్యారు. స్థానిక శాఖ అకాడమీ కోచ్ షేక్ మౌలా పర్యవేక్షణలో అందిస్తున్న కఠినమైన శిక్షణ మరియు క్రీడాకారిణుల అంకితభావం వల్లే ఈ అరుదైన విజయం సాధ్యమైందని క్రీడా వర్గాలు కొనియాడాయి.

చిన్న వయస్సులోనే రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి, జాతీయ స్థాయికి ఎంపికైన షేక్ సారా మరియు వై. లాస్యలను రైల్వే కోడూరు ప్రాంత ప్రముఖులు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మరియు క్రీడాభిమానులు ఘనంగా అభినందించారు. రాంచీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, రైల్వే కోడూరు ప్రాంతానికి, మన రాష్ట్రానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని అందరూ మనసారా ఆకాంక్షించారు.